# చేతికర్ర

**మా** వారు మల్లెపూవులా పడక్కుర్చీలో పడుకొని న్యూస్ పేపర్ చదువుకొంటున్నారు. అంటే సమయం ఎనిమిది గంటలన్నమాట. ఆయన అన్నీ టైము ప్రకారం చేస్తారు. ఓ క్రమం ప్రకారం చేస్తారు. ఆయన ఇంట్లోనూ, ఉద్యోగం చేసిన రోజుల్లో, కాలేజిల్లోనూ క్రమ శిక్షణ పాటించిన వ్యక్తి. అదిగో సరిగా ఆసమయంలో మా పెద్దాడి కూతురు వచ్చి, 'తాతగారూ! మీ నెయిల్ కటర్ ఓసారివ్వరా? గోళ్లు కత్తిరించుకోవాలి!' అంటూ ఆయన్ని అడిగింది. అది అడిగి తీసుకున్న వస్తువు తిరిగి ఇవ్వదు. పనవగానే ఏ వంటింట్లోనో వరండాలోనో ఎక్కడ దాని చెయ్యి ఖాళీ అవాల్సిన అవసరం కనిపిస్తే అక్కడ దాన్ని వదిలిపెడ్తుంది.

మా వారు "కాదమ్మా నిన్న గోళ్లు తీసుకొని ఎక్కడో పెట్టాను" అన్నారు ఇవ్వననటం ఇష్టంలేక.

"ఎక్కడో ఎందుకు పెడ్తారు మీ షేవింగ్ కిట్ ఉంచే బ్యాగ్‌లోనే పెడ్తారు" అంటూ ఆయనకవకాశం ఇవ్వకుండా చెప్పకుండా తీసినట్టు కనిపించకుండా అనుమతికోరకుండా మా గదిలోకి వెళ్ళి దాన్ని తీసుకొని మేడపైకి దాని గదిలోకి వెళ్ళింది. రేపు మేము దాన్ని అక్కడ, ఇక్కడ లేకపోతే మరోచోట వెతుక్కోవలసిందే...!

ఆయనకు తన వస్తువులు నిర్ణీత స్థలాల్లో పెట్టుకొనే అలవాటు వల్ల, మావి కనిపించనప్పుడు సూదీదారం ఏదైనా సరే ఆయనని తీస్తుంటాం. మళ్ళీ అవి వాడు కొన్నాక అక్కడ పెట్టాలన్న స్పృహ ఇంట్లో ఎవరికీ ఉండదని ఆయన విసుక్కొంటూ ఉంటారు.

ఒక గంట తరువాత మనవరాల్ని అడిగాను, "ఏమే తాతగారి నెయిల్ కటర్ వెనక్కి పెట్టావా?" అని

"లేదు" అంది ముద్దువల్ల కలిగే ధైర్యంతో

"తాతగారు తనవస్తువులు ఎంతో జాగ్రత్తగా పెట్టుకొంటారు కదా! ఆయన వస్తువు తీసుకొన్నప్పుడు వెనక్కి పెట్టవద్దా!" అని కొద్దిగా గదమాయించాను.

"ఇంట్లో అన్ని తాతగారివి, మిగిలినవారివీనూ. తాతగారి కొక్కరికి ఒక నెయిల్‌కటర్ ఒక టూత్‌పేస్టు, ఒక టాయిలెట్ మిగిలిన వారందరికి ఒక నెయిల్‌కటర్, ఒక టూత్‌పేస్టు, ఒక టాయిలెట్ – నాకు ఒక సెపరేట్ గది, సెపరేట్ వస్తువులు ఉంటే నేనూ జాగ్రత్తగానే పెట్టుకొంటాను" అనేసింది భడవ.

విడిగా వస్తువులైతే ఇవ్వగలంగాని గదులూ టాయిలెట్‌లూ విడివిడిగా అందరికీ ఇవ్వడం వీలవుతుందా! ఆయనకి రిటైరయ్యాక హార్డు ఎటాక్ వచ్చింది. అందుకని ఆయనకి ఇబ్బంది కలగకుండా ఆ ఏర్పాటు. నిజానికి ఆయన సర్వీసులో మా ఊళ్ళో ఉన్నప్పుడూ ఆయన విడే! అదే ఇక్కడా కొనసాగుతుంది.

మా ఇంట్లో ఎవరితోనైనా నేను మావారి పక్షాన మాట్లాడితే వాళ్లు ప్రతిదానికి విపరీత భాష్యం చెప్తారు. మధ్యాహ్నం "త్వరగా కాఫీ చెయ్యి సినిమాకి వెళ్దాం" అన్నారాయన.

నేను ఆయనకి కాఫీ ఇచ్చి నేను తాగి బయల్దేరాను ఆయన్తో. రోడ్డు దాటేటప్పుడూ ఆటో ఎక్కేటప్పుడూ నా చెయ్యో, భుజమో ఆయన ఆసరా తీసుకొంటారు. వయస్సులో ఉన్నప్పుడు ఆముచ్చట ఎప్పుడూ లేదు. నాకేమో సియెలో కారు ప్రకటన గుర్తుకు వస్తుంది. మా ఇంట్లో ఎవరూ దాన్ని రొమాంటిక్‌గా తీసుకోరు.

మా అమ్మాయి ఓసారి,

"అమ్మా! నాన్నగారు నిన్ను చిన్నప్పుడెప్పుడైనా సినిమాకి తీసుకువెళ్ళారా? ఇప్పుడైతే ధైర్యంతో తీసుకెళ్తున్నారు కాని..." అని అడిగింది.

"పాపం మీ నాన్నగారికి అంత తీరుబడేదే! నీ పెళ్లికి, పెద్దాడి చదువుకి డబ్బు సంపాదించడానికి ట్యూషన్లూ పేపర్లు దిద్దడాలు చెయ్యడంతో సరిపోయేది, మీ నాన్నగారు నన్ను సినిమాలకి తీసుకువెళ్ళకపోయినా, మిమ్మల్ని తీసుకొని నేను వెళ్లడానికి ఎప్పుడూ అడ్డుచెప్పలేదు కదే!" అంటే మా అమ్మాయి ఏమందంటే

"నిజమే! కాని నాన్నగారు ఎప్పుడైన సినిమాకి వెళ్లేవారు కదా! ఆ సినిమా మనతో కాకుండా స్నేహితులతో వెళ్లేవారు. తను వెళ్లే క్లాసుకి మనందర్ని తీసుకు వెళ్లటం ఖర్చుతో కూడిన పని కదా! అందుకని మనల్ని విడిగా పంపేవారు" అంది.

ఏమైనా మావారితో కలిసి ఈ ముసలి వయస్సులోనైనా సినిమాలకి వెళ్లడం నాకు బాగుంటోంది. నా చెయ్యి ఆయనకి ఆసరా అయినా ఆయన చెయ్యి నాకు రక్షణ అయినా అందులో నాకు హాయివుంది.

సినిమాలో హీరో హీరోయిన్‌లు ఊటీలో పరిగెడ్తున్నారు. ఈ లొకేషన్ ఊటీ అని ఆయనే చెప్పారు. నేను చూడలేదు. మా పెద్దాడూ భార్యా మనవరాలూ ఎల్.టి.సిలో వెళ్లారీ మధ్య. మా రోజుల్లో ఎల్.టి.సిలు లేవో, మా వారి ఉద్యోగానికి లేవో... కాని లేవు. ఆయనెప్పుడో మైసూరుకి పనిమీద వెళ్లినప్పుడు ఊటీ చూసి వచ్చారు. అప్పుడు బేరీలు, యాపిల్స్, నూల్‌కోల్, బఠానీలు, బీన్సు, క్యారెట్లు ఒకటేమిటి చాలా తెచ్చారు. వాటితో ఇంటిల్లి పాదికి ఓ వారం చక్కటి కూరలు వండిపెట్టాను. "ఇన్నాళ్లకి ఇద్దరం కలిసి ఊటీ చూస్తున్నాం" అనుకొన్నాను సినిమా చూస్తున్నంతసేపు.

ఇంటికి వెళ్ళాక నేను నా ఆనందాన్ని కోడలుతో పంచుకొందామని "మీరే కాదు! నేను ఊటీ చూసాను ఇవాళ సినిమాలో అన్నాను.

"బావుంటుందండి అక్కడ నేను, పాప మీ అబ్బాయి బోటు షికారు చేసాం. అదో గొప్ప అనుభవం. మీ అబ్బాయి వాళ్ల నాన్నగారు వాళ్ళని చిన్నప్పుడు కనీసం స్టీమరు

మీద బొబ్బర్లంకకైనా తీసుకవెళ్లలేదు అన్నారోసారి” అని నాతో కోడలు పిల్ల అంది.

ఏమిటో నా పిల్లలు జరగనివి తలుచుకొని బాధపడ్తారు. నాకున్నవి గుర్తించి ఆనందిస్తాను.

కోడలు పిల్ల ఆ మాటలు, వాళ్లాయన అన్న మాటలు యథా తథంగా నాకు వినిపించిదో ఆ మాటలకి తన సానుభూతి తిరగమోత తగిలించి అంటించిందో అర్థం కాలేదు. నేను మాటలు సాగనియ్యలేదు. మర్నాడు కొడుకు, కోడలు బొంబాయి ప్రయాణం పెట్టుకొన్నారు. వాడికేదో ఆఫీసు పనుంటే కోడలు కూడా వెళ్తోంది.

తెల్లారి లేచి కోడలు కాఫీ కాచి టిఫిన్లు చేసింది, కూతుర్తో “మామ్మగార్ని రెండు రోజులూఅల్లరిపెట్టకు, పెంకి సమాధానాలు చెప్పకు” అంటూ బుద్ధులు చెప్పింది.

తల్లీ తండ్రి రైలుకి వెడుతుంటే మా మనవరాలు, తనూ స్టేషన్‌కి బయల్దేరింది. ఆది వారమే కదా కాలేజి లేదంటూ మా ఇంటికి స్టేషన్ దూరంకాదు. వాళ్లు ఆటో ఎక్కితే ఇది తన మోపెడ్ మీద అనుసరించింది.

పదకొండు గంటల వేళ స్టేషన్ నుంచి అలసి పోయి వచ్చి అది తాతగారి పడక్కుర్చీలో కూలబడింది. ఆయన ఆసమయంలో మా గదిలో ఏదో చదువుకొంటున్నారు.

“నేను వెళ్లడం మంచిదైంది. రైలు రష్‌గా ఉంది. స్లీపర్‌కోచ్‌లో ఒకొక్కళ్లు చచ్చేంత లగేజీతో ఎక్కారు. నేను వెళ్లి వీళ్ల సీట్లు కింద సామాను పెట్టిన పైవాళ్ల సామాన్లు దెబ్బలాడి తీయించి వాళ్ల సామాన్లు సర్దివచ్చాను. వీళ్లు మరీ మొహమాటపడి చూస్తూ నిలబడిపోయారు” అంది అది.

‘అదేమిటి స్లీపర్ అంటున్నావు, నాన్న ఆఫీసు పని మీద వెళ్తున్నాడు కదా ఫస్ట్ క్లాస్ ఇవ్వరూ? అని అడిగాను. వీళ్లంతా ఎల్.టి.సి.లో ఫస్టుక్లాసులో ఊటీ వెళ్లి వచ్చారు కదా! ‘ఇస్తారు నాన్నగారికొక్కరికి, అమ్మకివ్వరు కదా! అందుకని ఇద్దరు స్లీపర్‌లోనే వెళ్తున్నారు. ‘అంది మనవరాలు.

నేను ఒకసారి మా వారితో ఆయన ఆఫీసు పనిమీద మద్రాసు వెళ్తుంటే ఆయన్తో వెళ్లాను. అప్పుడు పెళ్లయిన కొత్త మాకు పిల్లలు లేరు అప్పటికి. ఆ విషయం ఇన్నాళ్లకి ఇప్పటికి గుర్తు వస్తోంది.

ఆయన ఏదో కాలేజీకి పరీక్షకుడిగా వెళ్తున్నారు. అక్కడో పాత దేవాలయం ఉంది. నాకు చూపిద్దామని నన్నూ రమ్మన్నారు. రెండ్రోజులు ఊళ్లో ఉండాలి.

సామాన్లు రెండు మూడు శాల్తీలు తయారయ్యాయి. హోల్డాలు, పట్టుబట్టలు, ఫిల్టరు, కాఫీపొడి, బట్టలు వగైరాలు. అక్కడ సత్రంలో మాకు సదుపాయం చేసామని కాలేజీ వాళ్లు వ్రాసారు. మా వారికి కాలేజీ వాళ్ళు ఫస్టుక్లాస్ ఛార్జీలు ఇచ్చారు. కాని నాకు ఇవ్వలేదు కదా! అందుకని నాకు సెకండ్ క్లాసు టికెట్టు కొని ఆడవాళ్ళ పెట్టెలో ఎక్కించారు. ప్రతీస్టేషన్లో కాఫీ కావాలా అనో ఈ పండు తిను అంటూనో నాపెట్టె దగ్గరకి వచ్చి పలకరించారు. ఆయన అలా దిగి రావటానికి వీలుగా సామాన్లు నా దగ్గరే ఉంచారు. ఆ

రోజు నా పెట్టెలోని మిగిలిన ఆడవారు మావారికి నాపట్ల ఉన్న ప్రేమ చూసి ఎంత అసూయ పడ్డారో! అక్కడ ముళ్లపూడి వారి బుడుగు ఉంటే "వురేయ్! ముగుడూ! నీ పెళ్లాన్ని నే కాపాడ్తానుగాని నువ్వు పెతీసారీ ఇల్లా పరిగెత్తుకొని రాకు" అనే వాడేమో! పెళ్లయిన కొత్త కదా! నన్ను ఓ క్షణం విడిచి ఉండలేక పోయేవారు.

ఈ మాటే ఒకసారి మా అమ్మాయితో అంటే "పో! అమ్మా! అంత విడిచిఉండలేని వారు నీకూ ఫస్ట్‌క్లాస్ టిక్కెట్‌కొని పక్కన కూర్చోపెట్టుకోవచ్చుకదా! పోనీ ఖర్చు అనుకుంటే తనూ సెకండుక్లాసు టిక్కెట్ కొనుక్కోవచ్చు కదా! ఆ రోజుల్లో నాన్నగారు చిన్నవారు కదా, కేవలం నీ కోసమే, ప్రతీ స్టేషన్లో నూ ఆ ఆడవాళ్ల పెట్టె దగ్గరికి వచ్చారంటే నమ్మమంటావా?" అంది నవ్వుతూ.!

అది అన్నింటికి పెడార్థాలే తీస్తుంది. కాలేజీ వాళ్లు ఫస్టుక్లాసులు ఛార్జీలు ఇస్తున్నప్పుడు సెకండుక్లాసులో ప్రయాణం చేసి డబ్బులు మిగుల్చుకోవడం ఆయన నియమావళికి వ్యతిరేకం కదా!

మనవరాలు తన గదిలోకి వెళ్లిపోయింది భోజనాలు అవగానే. ఆయన మా గదిలో విశ్రాంతి తీసుకొంటున్నారు. నేను హాల్లో టి.వి. చూస్తూ చాపమీద పడుకున్నాను. అప్పుడు పోస్టుమాన్ వచ్చి మా అమ్మాయి వ్రాసిన ఉత్తరం ఇచ్చాడు. మా అమ్మాయికి హిస్టరెక్టమీ ఆపరేషన్‌ట. వచ్చి ఓ నెలరోజులు సాయం చెయ్యమని వ్రాసింది. ఉత్తరం నా పేర్నే వ్రాసింది.

ఆయన నిద్ర నుంచి లేచి కాఫీ తాగుతుంటే అమ్మాయి ఉత్తరం విషయం చెప్పాను. కోడలుంటుంది కనుక ఆయనకి ఇబ్బంది ఉండదని కూడా సూచించాను.

"నీ ఇష్టం! కాని నెల రోజులు నువ్వెళ్లి ఆ ఊళ్లో, ఆ కొత్త స్థలంలో కొత్త నీళ్లు తాగుతూ చాకిరీ చేస్తే నీ ఆరోగ్యం పాడవుతుంది. నాకు మాత్రం నువ్వెళ్లటం ఇష్టంలేదు.' అన్నారు. నాకాయన అనుజ్ఞ లేదు. కాని నన్ను ఆయన ఆపరు! అదీ ఆయన ధోరణి. నేను ఆయనని కాదని ఈ నలభైఏళ్ల సంసారంలో ఎప్పుడూ ఏ పనీ చేసిందీ లేదు. నాకు వీలవదు, నువ్వే ఈ ఊరు వచ్చి ఇక్కడ ఆపరేషను చేయించుకో అని వ్రాయాలని నిర్ణయించుకొన్నాను. దానికి దాని మొగుడుకి, దాని పిల్లలకి ఈ ఏర్పాటు ఇబ్బందికరం అని నాకూ తెలుసు. అది రాదు.

కాని నన్ను ముల్లులాగుచ్చుతున్న విషయం నేను చదివి చింపేసిన అమ్మాయి ఉత్తరంలో చివరి వాక్యాలు.

"అమ్మా! నాన్నగారికి తన వస్తువులు ఇతర్లు వాడడం ఇష్టం ఉండదు. అరిగిపోతాయి కదా! నువ్వు ఇక్కడకి రావడం నాన్నగారికి ఇష్టం ఉండదని నానమ్మకం. నాన్నగారికి అయిష్టం అయిన పని నువ్వు చెయ్యవు. చెయ్యకపోవడానికి ఓ గొప్పకారణం నీకు ఎప్పుడూ ఉంటుంది. నువ్వు రాకపోతే నేను అర్థంచేసుకొంటాను" అంటే, నేను మావారికి ఉపయోగకరమైన వస్తువుని మాత్రమేనా...!